## నైజం కథ

### డబ్బు సంపాదించడానికి అతను ఆడే ఆటలో బలైపోయిన అభాగ్యులెవరు?

# నైజం




పదహారేళ్ల అమ్మాయి మొహంలా అందంగా ఉంది పట్టణం.

ఆ మొహంమీద అక్కడక్కడా మొలిచిన మొటిమల్లా అసహ్యంగా ఉన్నాయి గుడిసెలు.

స్వతంత్రం సంపాదించుకున్న దేశంలో ధనవంతులతోపాటు దరిద్రులకి కూడా బతికి ఉండే స్వేచ్ఛ ఉందనడానికి నిదర్శనంగా ఉన్నారు గుడిసెల్లోని జనం.

ఆ జనం కట్టిన మేడల్లో ఉంటున్నారు – ఆస్తులున్న వాళ్లు. ఆస్తులని సంపాదించిపెట్టే పదవులూ, ఉద్యోగాలూ ఉన్నవాళ్లు.

మేడల్లో ఉన్నవాళ్ల పనులనీ గుడిసెల్లోని వాళ్లవే. అంట్లు తోమడం, ఇళ్లు తుడవడం, బట్టలు ఉతకడం, రాత్రుళ్లు కాపలా కాయడం, పిల్లల్ని స్కూళ్లకి, తల్లుల్ని క్లబ్బులకి, తండ్రులని ఆఫీసులకి రిక్షాల్లోనో, ఆటోల్లోనో, కార్లలోనో తీసికెళ్లడం- ఇవన్నీ గుడిసెల్లోని వాళ్ల పనులే.

తమ గుడిసెల్లోకన్న మేడల్లోనే వాళ్లకి పని ఎక్కువ.

అందుకే మేడలు మద్రాసులోని పెద్దపెద్ద స్టీలు కొట్లలోని గిన్నెల్లా తళతళా మెరుస్తుంటాయి. గుడిసెలు మాత్రం కనకదుర్గ గుడి మెట్ల మీద అడుక్కునే బిచ్చగాళ్ల బొచ్చెల్లా వికారంగా ఉంటాయి.

ఒంటి మీద ఉన్న గజ్జి కురుపుని భరిస్తున్నట్లు భరిస్తుంది పట్టణం ఆ గడిసెల్ని. ఒక్కోసారి తొలగించుకునేందుకు ప్రయత్నం చేస్తుంది. అయితే ఒక చోట పోతే కురుపు మరో చోట లేస్తుంది. గుడిసెలూ అంతే.



గుడిసెలకు ఇంకో లక్షణం ఉంది. అవి విడిగా ఉండవు. పదో, వందో, వెయ్యో కలిసి ఓ వాడగా ఉంటాయి, ఆ వాడలు వాక్యూమ్ క్లీనర్‌ల లాంటివి.

పట్టణంలోని దుమ్మునీ, ధూళినీ తమ లోకి లాగేసుకుంటాయి. ఇంకెవ్వరూ భరించలేని విషాన్ని శివుడు తన కంఠంలో ఉంచుకున్నట్లు మేడల్లో వాళ్ల సహించలేని

మురికినంతా తమలోకి తీసుకుంటాయి ఆ వాడలు.

అలాంటి మురికివాడ అంటుకుంది. వాడ అంటుకుందంటే గుడిసెలు అంటుకున్నాయి. వంద గుడిసెలున్న ఆ వాడ మధ్యనున్న ఓ గుడిసెలో మొదలయింది మంట.

గాలి వాటాన్ని బట్టి మంట ఏ పక్కకయినా వ్యాపించవచ్చు. ఎటుపక్కకి పెరుగుతుందో తెలియదు. గుడిసెలలో ఉన్న వాళ్లంతా హడావిడిగా పరిగెత్తసాగారు. అరవసాగారు. అంటుకున్నది మధ్యాహ్నం మూడింటికి అవడంతో చాలామంది పనులకి బయటికి వెళ్లారు. ఇళ్లలో ఉన్న వాళ్లలో చాలామంది పని చెయ్యలేని ముసలి వాళ్లూ, పసి పిల్లలూ, వాళ్లను చూసుకునే తల్లులే. రాత్రి డ్యూటీ చేసుకొచ్చి పడుకున్న కొందరు మగాళ్లున్నారు. అంతే.

మంట తమ గుడిసె దగ్గరకి వచ్చేలోగా తమకి అవసరమైన వస్తువుల్ని తీసుకుని మంటలకి దూరంగా వెళ్లిపోవాలన్న ప్రయత్నంలో ఉన్నారు వాళ్లంతా. వండుకుందుకు కొన్ని గిన్నెలూ, కట్టుకుందుకు కొన్ని బట్టలూ తప్ప ఇంకేమీ లేని ఇళ్లే ఎక్కువ. కానీ అవి లేకపోతే రోజు గడవడం కష్టం వాళ్లకి. అక్కడక్కడా ఓ ఇంట్లో ట్రాన్సిస్టరో, ఫేనో, టీవీయో ఉండొచ్చు. ఏది అవసరమో, ఏది అనవసరమో ఏరడం ఎలా? ప్రాణంలేని సామానులతోపాటు కొద్ది కాలం క్రితమే ప్రాణం పోసుకున్న పిల్లల్ని, ఇంకొద్ది కాలంలో ప్రాణం పోయే పెద్దల్ని జాగ్రత్తగా బయటకి చేర్చుకోవాలి.

పిల్లల్ని, ముసలి వాళ్లని తీసుకుని చేతికందినవి పట్టుకుని పరుగెడుతున్నారు ఓపిక ఉన్నవాళ్లు. పరిగెత్తడానికి అక్కడ ఉన్నవి విశాలమైన రోడ్లు కాదు. ఇరుకులో ఒకరినొకరు తోసుకుంటూ ఒకరిమీద ఒకరు పడుతూ పరిగెడుతున్నారు. నిజానికి ఎటు పరిగెడితే మంచిదో కూడా తెలియని స్థితిలో ఉన్నారు. అయోమయ స్థితిలో ఆలోచన ఉండదు. అంతటి మహా విష్ణువు కూడా గజేంద్రుడు 'పాహి పాహి' అని అరిస్తే, ఆయుధాలు తీసుకోకుండా పరిగెత్తసాగేడుట!

అలాంటి అయోమయ స్థితిలో ఉంది రత్తాలు. రత్తాలుకి ఇరవై ఏళ్లుంటాయి. పెళ్లయి ఏడాది, చూలయి ఎనిమిది నెల్లూ అయ్యాయి. తను లేచి నడవడమే కష్టం. పుట్టబోయే శిశువు బరువుంది తనలో. దానికి తోడు లేవలేకుండా పడుక్కునున్న ముసలి ప్రాణం ఉంది గుడిసెలో. ఆ ప్రాణం రాంబాబు తండ్రిది. రాంబాబు రత్తాలు మొగుడు.

రాంబాబు కారు నడుపుతాడు. ఆ కారు రాంబాబు స్వంతం కాదు. ఇల్లూ, ఇల్లాలూ, తండ్రి తప్ప రాంబాబుకి స్వంతంగా ఏమీ లేదు. పెళ్లయ్యాక రత్తాలు ఇంట్లోకి సామాను చేర్చింది.

తను ఆ ఇంటికి వచ్చే సరికే ఇంట్లో రాంబాబు తండ్రినీ, తను ఆ ఇంతికి తనతోపాటు తీసుకొచిచన సామానునీ తీసుకుని బయట పడ్డం ఎలాగో తెలియలేదు రత్తాలుకి. మంట ముందే చెప్పి మొదలవలేదు. అప్పటికప్పుడు ఆలోచించి పని

వేసుకుందుకు సమయంలేదు. దానికి తోడు రత్తాలు ఉత్తమనిషి కూడా కాదు.

పక్క వాళ్ళో, తెలిసిన వాళ్ళో చూసి సాయం చేసేందుకు వాళ్ళు తీరిగ్గా కూర్చుని లేరు. ఎవరి హడావిడివాళ్ళది.

రాంబాబు ఉంటే బాగుండునన్న ఆలోచన వచ్చింది రత్తాలుకి.

అయితే చుట్టూ ఎక్కువవుతున్న మంటలూ, అరుపులూ రత్తాలుని ఆలోచించనివ్వలేదు.

** ** **

''అక్కడ ఇళ్ళు అంటుకున్నాయి'' అన్నాయి తమ మధ్యనున్న పైప్‌ని కదలనీయకుండా రెండు పెదవులు.


''ఎక్కడా?'' అన్నాయి ఒకదానికొకటి ఎక్కువ దూరం కాకుండా రెండు లిప్‌స్టిక్ పెదవులు.

పట్టణం మధ్యలో ఉన్న పదంతస్తుల మేడలో ఏడవ అంతస్తులో ఉన్న ఫ్లాట్‌లోని ఓ బెడ్‌రూమ్‌లో ఉన్న మగా, ఆడ పెదవులు అవి.

మగ పెదవుల యజమాని గౌతమ్. అతనే ఆ ఫ్లాట్‌కి యజమాని. అలాగే రెండు కంపెనీలకీ, ఇంకా కొన్ని కంపెనీలలో షేర్లకీ యజమాని. రాంబాబు నడుతుపున్న కారుకి కూడా ఆయనే యజమాని.

ఆ పెదవులు అహల్యవి. గౌతమ్‌తో పెళ్ళి కాకముందు అహల్య పేరు అహల్య కాదు. పెళ్ళయ్యాక మార్చుకుంది. అహల్యకి నలభై ఏళ్ళు ఉంటాయి. అయితే ముప్పైయేళ్ళ యువతిలా ఉంటుంది. ఒంటినిండా నగలు దిగేసుకునే మనస్తత్వం కాదు అహల్యది. మెళ్ళో ఓ డైమండ్ నెక్లెస్, చెవులకి డైమండ్ దుద్దులూ మాత్రమే ఉన్నాయి. వాటి ఖరీదు లక్షల్లో ఉండచ్చునంటారు తెలిసినవాళ్ళు.

ఆ లక్షలు గౌతమ్ సంపాదించినవే. అతనికి గవర్నమెంటు కంట్రాక్టులు సంపాదించడం తెలుసు. ఆ కంట్రాక్టులలో



లాభం సంపాదించడం తెలుసు.

గవర్నమెంటు స్వంతంగా పనులు చేసుకోదు. కంట్రాక్టర్ల ద్వారా చేయిస్తుంది. ఏ కంట్రాక్టర్ ద్వారా పని చేయించుకోవాలో నిర్ణయించుకునేందుకు టెండర్లని పిలుస్తుంది. అందరికన్నా తక్కువ ధరకి చేసిపెట్టే కంట్రాక్టర్ చేతే పనిచేయించుకుంటానంటుంది.

టెండర్ అన్నింటిలోనూ తక్కువ ఖర్చు చూపించేది గౌతమ్ టెండరే అవుతుంది. అందుకు కొన్ని కారణాలున్నాయి. అన్ని టెండర్లలోకి ఆఖరుగా అందే టెండర్ గౌతమ్‌దే అవుతుంది. ఆఖరు రోజు సాయంత్రం మూడూ, మూడున్నర ప్రాంతంలో గౌతమ్‌కి ఒక ఫోన్ వస్తుంది. అంతవరకూ సెక్షన్‌కి వచ్చిన ఎస్టిమేట్స్ అన్నిటిలోనూ తక్కువ మొత్తం ఎంతో అతనికి చెప్తారు అతని హితులు ఆ ఫోన్ ద్వారా. సీల్‌డ్ కవర్లలోని కాయితాలపై రాసున్న నంబర్లని చదవగల మాయగాళ్ళు ఆ హితులు. సాయంత్రం అయిదులోగా తన టెండర్‌ని ఇచ్చేస్తాడు గౌతమ్. ఆ తక్కువ మొత్తంకన్నా తక్కువ ఎస్టిమేట్‌తో.

అందుకే కంట్రాక్ట్ అతనికే వస్తుంది.

ఆ రోజు అలాంటి ఫోన్ కోసమే ఎదురుచూస్తూ, కిటికీలోంచి బయటకి చూసాడు. దూరంగా మంటలు కనిపించాయి. అదే మాట మంచం మీద పడుకొని ఉన్న అహల్యతో అన్నాడు. ఎక్కడ అని తను అడిగిన ప్రశ్నకి గౌతమ్ సమాధానం చెప్పేలోగానే కిటికీ దగ్గరకొచ్చి చూసింది అహల్య.

"ఈ గుడిసెల్ని తీసేసేందుకు పోలీసు వాళ్ళే నిప్పంటిస్తూ ఉంటారు ఒక్కోసారి" అన్నాడు గౌతమ్.

"ఒక్కోసారి వాళ్ళే నిప్పెట్టుకుంటారు. ఇళ్ళు తగలబడ్డాయని ప్రభుత్వం ఇచ్చే డబ్బు తీసుకునేందుకు" అంది అహల్య.

"ప్రాణాలూ, సామాన్లూ నష్టపోవచ్చును. అలా ఎలా చేస్తారు?" అన్నాడు గౌతమ్ ఏదో ఆలోచిస్తూ.

"మన పని మనిషి ఉండేది ఆ వాడలోనే కదూ?" అంది అహల్య.

"అవును. మన డ్రైవర్ ఉండేదీ అక్కడే" అన్నాడు గౌతమ్.

"అతనేడి?" అని అడిగింది అహల్య.

"కింద కార్ దగ్గరే ఉన్నాడు. కింద నుండి మంటలు కనిపించవేమో" అని గౌతమ్ అంటుండగా ఫోన్ మోగింది.

త్వరగా వెళ్ళి ఫోన్ తీశాడు.

అవతలి కంఠం పరిచితమైందే. ఆ మనిషి చెప్పింది జాగ్రత్తగా విని, ఫోన్ పెట్టేసి, బ్రీఫ్‌కేస్‌లోంచి కావల్సిన కాగితాలు తీసుకుని, అందులో ఎస్టిమేట్స్‌వేసి, కవర్‌లో పెట్టుకుని...

"టైమయిపోతోంది. నేను వెళ్ళివస్తాను" అంటూ నడవసాగాడు.

"తొందరగా రండి. ఇళ్ళు అంటుకున్న చోటుకి వెళ్ళి చూసి వద్దాం. పాపం మన పనిమనిషి ఏం అవస్త పడుతోందో" అంది అహల్య.

తొందరగా నడుచుకుంటూ లిఫ్ట్ దగ్గర కెళ్ళి, కిందకి దిగి, కారులో కూర్చుని "తొందరగా పోనియ్యి" అన్నాడు

రాంబాబుతో గౌతమ్.

ఆ సమయంలో తొందరగా పోనియ్యమంటే ఎక్కడికో తెలుసు రాంబాబుకి. కారు స్టార్ట్ చేశాడు.

ఎ.సి. కారులో చల్లగా ఉంది. కారు సీట్లు మెత్తగా ఉన్నాయి. శబ్దమూ, కుదుపూ లేకుండా సాగుతోంది కారు.

ఎస్టిమేట్స్ కాయితాలు వేసుకుంటూ, కాల్కులేటర్‌తో లెక్కలు వేసుకుంటూ చూస్తున్నాడు గౌతమ్. లాభం పది లక్షల దాకా కనిపిస్తోంది అతనికి.

కారుని ఆఫీసు దగ్గర ఆపాడు రాంబాబు

టెండర్‌ని ఇవ్వాల్సిన సెక్షన్‌లో ఇచ్చేసి, తిరిగి వచ్చి, కార్‌లో రిలాక్స్‌డ్‌గా కూర్చున్నాడు గౌతమ్.

"ఎక్కడకి సార్" అన్నాడు రాంబాబు.

"లోపలెవరో అంటుంటే విన్నాను. మీ ఇంటివైపు గుడిసెలు అంటుకున్నాయట. అక్కడకి వెళ్దాం పద" అన్నాడు గౌతమ్.

కార్‌ని తన ఇంటి వైపుకు నడిపాడు రాంబాబు.

ఒక గంట సేపు మండి, ఉన్న గుడిసెలన్నీ కాలిపోయాక ఇంకా కాల్చేందుకు ఏమీ మిగలక, చల్లారుతోంది మంట.

అంతకుముందొక వాడ అక్కడ ఉందన డానికి నిదర్శనంగా కాలిపోయిన ఆకుల బూడిదా, మండుతున్న కర్రలూ ఉన్నాయి. వాటి అడుగున కాలుతూ కొన్ని సామాన్లు కనిపిస్తున్నాయి.

అక్కడకెళ్ళి అవి తెచ్చుకోలేని అసహాయతతో చుట్టూ నిల్చుని చూస్తున్నారు ఆ ఇళ్ళలోని వాళ్ళు. కొందరు కన్నీళ్ళు తుడుచుకుంటున్నారు. కొందరు గట్టిగా ఏడుస్తున్నారు. కొందరు పిల్లల్ని సముదాయిస్తున్నారు. కొందరు నిస్సహాయంగా చూస్తున్నారు. కొందరు తమ వాళ్ళందరూ ఉన్నారో లేదో చూసుకుంటున్నారు. కొందరు సామాన్లు జాగ్రత్త



## జ్ఞాపకం!

"నాన్నా. నువ్వు ఓసారి చూసిన మొహాన్ని మళ్ళీ గుర్తు తెచ్చుకోగలవా?"

"ఓ ఖచ్చితంగా"

"హమ్మయ్యా, ఐతే పర్లేదు. నువ్ గడ్డం గీస్కునేటప్పుడు చూస్కునే అద్దం పగలగొట్టేసా"

– పద్మశ్రీ (మాణిక్యారం)

చేసుకుంటున్నారు. కొందరు అక్కడక్కడా కనిపిస్తున్న మంటల మీద నీళ్ళు పోస్తున్నారు.

వాళ్ళనీ, మండిన ఇళ్ళనీ చూస్తూ నిలబడ్డారు ఇంకొందరు. వాళ్ళు అంతకుముందు తాము చూసిన మంటల గురించి చర్చించుకుంటున్నారు. ఈ మంట ఎలా మొదలయి ఉంటుందోనని తర్కించుకుంటున్నారు.

కార్‌లో నుండి దిగిన రాంబాబు రత్తాలు కోసం చూశాడు. ఓ మూలగా కూర్చునుంది రత్తాలు. రత్తాలు ఒడిలో పడుకుని ఉన్నాడు రాంబాబు తండ్రి.

రాంబాబు అటు నడిచాడు. గౌతమ్ కూడా అటే నడిచాడు.

''చూసావా మావా! ఏం జరిగిందో. నువ్వు లేనప్పుడే రావాలా ఈ మంట'' అంటూ ఏడవ సాగింది రత్తాలు.

''ఇద్దరూ బానే ఉన్నారు. అదే సంతోషం నాకు'' అన్నాడు వాళ్ళ పక్కనే కూర్చుంటూ రాంబాబు.

**''మేం బానే ఉన్నాం. సామాను ఏమీ మిగలలేదు'' అంది రత్తాలు ఏడుస్తూనే.**

''నేనెట్టాగన్నా వచ్చేస్తాను. నువ్వా పెట్టె పట్టుకుని వెళ్ళిపో అని చెప్పా. అందులోనే నాలుగు చీరలూ, నాలుగు డబ్బులూ ఉన్నాయి. అది ముఖ్యం అని కూడా చెప్పా. అది వినలే నన్నొదిలి వెళ్ళననీ, నన్ను నెమ్మదిగా ఇక్కడకి చేరేసింది. ఇల్లు కాలిపోయింది'' అన్నాడు రాంబాబు తండ్రి.

''తన్నొదిలేసి నేనెట్లా గొచ్చేసేది?'' అని అంటూ రాంబాబు పక్కనే ఉన్న గౌతమ్‌ని చూసి ''తమరా బాబూ'' అంటూ లేవబోయింది రత్తాలు.

''కూర్చోమ్మా లేవకు'' అని గౌతమ్ అంటుండగా అక్కడ కొచ్చింది అహల్య.

''నువ్వూ వచ్చావా?'' అన్నాడు గౌతమ్ అహల్యని చూస్తూనే.

''పాపం పనిమనిషి ఇల్లు కాలిపోయింది. వెళ్ళి చూసి కాస్త ధైర్యం చెప్పి, ఓ వంద రూపాయలిచ్చి, ఇంటికి వెళ్ళిపోబోతోంటే మన కార్ కనిపించింది. మీరు వచ్చి ఉంటారని ఇటు వచ్చాను. మిమ్మల్ని నమ్ముకునుంటే ఏమయ్యేదో? మీరు ఇలా వచ్చేసారేం?'' అంది అహల్య.

''రాంబాబు ఇంటివైపు ఇళ్ళు అంటుకుంటున్నాయని ఆఫీసు దగ్గర ఎవరో అన్నారు. ఇలా వచ్చేసాం ఇద్దరం'' అన్నాడు గౌతమ్.

అహల్య అతన్ని వింతగా చూసింది. ఏదో అందామనుకుని మానేసింది.

**''ఈ డబ్బు ఉంచు'' అంటూ జేబులోంచి వెయ్యి రూపాయలు తీసి రాంబాబు చేతిలో పెట్టాడు గౌతమ్.**

''అంత డబ్బొద్దు సార్'' అన్నాడు రాంబాబు.

''అలా అనద్దు'' అన్నాడు గౌతమ్.

''మా గుడిసెలో అంత ఖరీదైన వస్తువులు ఏమీ లేవు'' అంది కాస్త సిగ్గుపడుతూ రత్తాలు.

''మళ్ళీ గుడిసె వేసుకోవాలిగా ఉంచండి'' అంది అహల్య.

''ఎందుకమ్మా?'' అంటూ డబ్బు

''ఎందుకమ్మా?'' అంటూ డబ్బు తీసుకున్నాడు రాంబాబు.

''తర్వాత ఇంటికిరా ఇంట్లో పాత చీరలూ, షర్టులూ ఉన్నాయి. తీసుకెళ్దువు గాని'' అంది అహల్య రత్తాలుతో.

అలాగేనన్నట్లు తలూపుతూ ''మీరు దేవతమ్మా'' అంది రత్తాలు అహల్యతో.

''ఛ ఊరుకో'' అంది అహల్య.

''మీ నాన్నని జాగ్రత్తగా చూసుకో'' అని రాంబాబుతో అంటూ కదిలాడు గౌతమ్.

''వస్తాను'' అంటూ కదిలింది అహల్య.

''మిమ్మల్ని ఇంటి దగ్గర దింపేస్తాను'' అంటూ లేవబోయాడు రాంబాబు.

''నయంలే. వాళ్ళని వదిలేసి వస్తావా? రేపు కూడా డ్యూటీకి రావద్దు. నేను మేనేజ్ చేసుకుంటాలే'' అంటూ కార్ దగ్గరికి నడిచి, తలుపు తీసుకుని, ఎక్కి కూర్చున్నాడు గౌతమ్.

అహల్య వచ్చి పక్కన కూర్చోగానే కార్ స్టార్ట్ చేశాడు.


గుడిసెలకి దూరంగా వెళ్తోంది ఎ.సి. కార్.

''రేపోకసారి వచ్చి ఇళ్ళు కాలిన వాళ్ళందరికీ వందేసి రూపాయలిద్దాం'' అన్నాడు గౌతమ్.

''ప్రాయశ్చిత్తమా?'' అని అడిగింది అహల్య.

ఏమీ సమాధానం చెప్పలేదు గౌతమ్

****



## టెలివిజన్

స్కాట్ దేశపు కల్పనా చతురుడు, టెలివిజన్‌కి మార్గదర్శకుడు అయినా జాన్ లోగీ బయర్డ్ 1926 జనవరి 29న మెకానికల్ స్కానింగ్ డిస్క్ సహాయంతో మొట్టమొదటి టెలివిజన్ ట్రాన్స్‌మిషన్‌ను ప్రదర్శించాడు. కలర్ టీవీకి నాంది ఈయనే పలికారు.

– డి.సత్యమూర్తి

